సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



వరాల పండుగకు ఏర్పాట్లు

వరాల తల్లీ....వరలక్ష్మి....మా పూజలందుకుని వరాలు ప్రసాదించమ్మా...అంటూ మహిళా భక్తులు వరలక్ష్మి మాతను ప్రార్థించేందుకు సిద్ధమయ్యారు. -8లో



కృష్ణా, విశాఖ మ్యాచ్ డ్రా

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన కృష్ణా, విశాఖ మ్యాచ్ డ్రాగా ముగిసింది. కేఎస్ఆర్ఎంలో నిర్వహించాల్సిన చిత్తూరు, కడప మ్యాచ్ వాయిదా పడింది. -8లో

గరిష్టం/కనిష్టం
37.6 /27.2

వాతావరణం

జిల్లాలో గురువారం 27.2 నుంచి 37.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.28 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న మంత్రి ఫరూక్, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ (ఇన్సెట్) ప్రసంగిస్తున్న మంత్రి



- ప్రాజెక్టుల ద్వారా 2.35 లక్షల ఎకరాలకు సాగునీరు
- మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో అభివృద్ధి పనులు
- పరిశ్రమలు, మౌలిక వసతులకు ప్రాధాన్యత
- స్వదేశీ దర్శన్ కింద గండికోట పర్యాటక అభివృద్ధి
- 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి నశ్యం మొహమ్మద్ ఫరూఖ్

కడప సెవెన్‌రోడ్స్ : అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా ప్రజలకు సమర్ధవంతమైన పాలన అందిస్తామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ అన్నారు. గురువారం స్థానిక పోలీసు పెరేడ్ మైదానంలో నిర్వహించిన 78వ స్వాతంత్య్ర దినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెంట రాగా పరేడ్ తిలకించారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు.

వికసిత ఆంధ్రాలో భాగస్వాములు కావాలి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇదివరకే మెగా డీఎస్సీ, ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు, పెన్షన్ల పెంపు, నైపుణ్య గణన, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ ఫైళ్లపై సంతకాలు చేశారని వివరించారు. డ్రోన్లను వినియోగించి సాగులో సాంకేతికత పెంచుతామని చెప్పారు. వికసిత ఆంధ్ర లక్ష్య సాధనలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అన్నిశాఖల అధికారులు తమ పరిధిలో వంద రోజుల ప్రణాళికలు రూపొందించుకుని ఆ లక్ష్యాలను సాధించాలన్నారు.

జిల్లాలో 2.35 లక్షల ఎకరాలకు నీరు

రాబోయే 40 రోజుల్లో గండికోట, మైలవరం, చిత్రావతి, పైడిపాలెం ప్రాజెక్టుల్లో 40 టీఎంసీల పూర్తి స్థాయి నీటిమట్టాన్ని నింపి 2.35 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి వెల్లడించారు. తెలుగు గంగ అనుబంధ రిజర్వాయర్లలో రానున్న 70 రోజుల్లో పూర్తి స్థాయి నీరు నింపుతామన్నారు. ఈ సీజన్‌లో జిల్లా సాధారణ వర్షపాతం 220.6 మిల్లీ మీటర్లు కాగా, ఇప్పటివరకు 225.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. పంటల సాధారణ విస్తీర్ణం 75,189 హెక్టార్లకుగాను 21,071 హెక్టార్లు సాగైందన్నారు. ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ 30 నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం 4485 కోట్లకు గాను 6612 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేశామన్నారు. రాష్ట్రీయ కృషి వికాస యోజన ద్వారా 6.68 కోట్ల రూపాయలతో ఉద్యాన రైతులకుచేయూత ఇస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.323.98 కోట్లతో జిల్లాలో 31,500 హెక్టార్లలో బిందు, తుంపర సేద్య పరికరాలను పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో 875 మినీ గోకులాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. రానున్న వంద రోజుల్లో 10,285 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద 2020 పాఠశాలల్లో 1,29,799 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. కొప్పర్తిలో 276 కోట్ల రూపాయలతో బాహ్య నీటి సరఫరా పథకం, ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం, కార్యనిర్వాహక కేంద్రం, సర్వింగ్ సెంటర్‌తో కూడిన కార్గో టెర్మినల్ నిర్మాణపు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. జిల్లాలో రహదారులపై గుంతలు పూడ్చేందుకు రూ. 27.66 లక్షలతో ఐదు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామన్నారు. గండికోటను స్వదేశ్ దర్శన్ 2.0 స్కీమ్ కింద అభివృద్ధి చేస్తున్నామన్నారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు 50 ఎకరాల్లో ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని కడపలో మూడు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేలు, మైదుకూరులలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఎనిమిది అన్నా క్యాంటీన్లను సెప్టెంబరు చివరి నాటికి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

సమరయోధుల కుటుంబాలకు సత్కారం

జిల్లాలోని స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలకు చెందిన వేల్పుల నారాయణమ్మ, రమాదేవి, అరుణాదేవి, ఎస్.సుబ్బరాయుడు, శరత్‌బాబు, రఘురాంమూర్తి, జగన్ మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, బి.రత్నయ్యలను మంత్రి ఫరూఖ్ ఘనంగా సత్కరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థుల యే వతన్–మేరా వతన్, చెమ్ముమియాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల జన్మభూమి పిలుస్తోంది, మున్సిపల్ హైస్కూల్ (మెయిన్) విద్యార్థుల గండికోట థీం సాంగ్, జాతీయ సమైక్యతపై నిర్వహించిన నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం అగ్నిమాపకశాఖ లైవ్ డెమాన్‌స్ట్రేషన్ ఆకర్షించింది.

అవార్డుల ప్రదానం: జిల్లాలో విశిష్ట సేవలు అందించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి మంత్రి ఫరూఖ్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. డీఆర్‌డీఏ, మెప్మా శకటానికి మొదటి బహుమతి, వ్యవసాయ, ఉద్యానశాఖకు రెండవ బహుమతి, ఐసీడీఎస్, అటవీశాఖ శకటానికి మూడవ బహుమతిని మంత్రి అందజేశారు.

స్టాల్స్ సందర్శన – ఆస్తుల పంపిణీ

వేడుకల్లో భాగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలపై 18 ప్రభుత్వ శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశాయి. వీటిని మంత్రి సందర్శించారు. డీఆర్‌డీఏ, మెప్మా, వికలాంగుల సంక్షేమం, పరిశ్రమల కేంద్రం ద్వారా వివిధ పథకాల కింద 40,383 మంది లబ్ధిదారులకు రూ. 36629.01 లక్షలు విలువజేసే 12,735 యూనిట్లను మంత్రి ఫరూఖ్ పంపిణీ చేశారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు



భరత మాత వేషధారణలో విద్యార్థిని



వ్యవసాయశాఖ శకటం



పశుసంవర్ధకశాఖ శకటం



ఐసీడీఎస్ శకటం

శకటాల ప్రదర్శన

వ్యవసాయ, ఉద్యానశాఖ, జిల్లా నీటియాజమాన్య సంస్థ, పశుసంవర్ధకశాఖ, డీఆర్‌డీఏ, మెప్మా, నగర పాలక సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ, మహిళా రక్షణ 181, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ, విద్య, విద్యుత్, ఇంధన వనరులశాఖ, అటవీశాఖ, అగ్నిమాపకశాఖ తమ శకటాలను ప్రదర్శించాయి. పోలీసు శునకాలు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అలాగే రెస్క్యూషో ఆద్యంతం ఆకట్టుకుంది. డీఆర్‌డీఏ, మెప్మా శకటానికి మొదటి బహుమతి, వ్యవసాయ, ఉద్యానశాఖకు రెండవ బహుమతి, ఐసీడీఎస్, అటవీశాఖ శకటానికి మూడవ బహుమతి లభించాయి.



డాగ్ షో



భారీ జాతీయ జెండాతో విద్యార్థులు



అగ్నిమాపకయంత్రం విన్యాసాలు



సోలార్ విద్యుత్ ఉత్పత్తి శకటం





స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలను సన్మానిస్తున్న మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి నశ్యం మహమ్మద్ ఫరూఖ్

నమ్మి నడిచిన టీచర్లకు వెన్నుపోటు!

'ప్రభుత్వ జీవో 117 రద్దు చేస్తాం...టీచర్ల మనోభావాలను గౌరవిస్తాం. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తాం' ఎన్నికలకు ముందు ఎన్డీయే కూటమి నేతలు ఇలా ప్రతి సందర్భంలోనూ ప్రకటించారు. నారా లోకేస్ ఏకంగా టీడీపీ ప్రధాన కార్యదర్శి హోదాలో జీవో-117 రద్దు చేయాలంటూ లేఖ ఇచ్చారు. దీనిని ఉపాధ్యాయులంతా నమ్మారు.. కూటమి ప్రభుత్వాన్ని ఆదరించారు. సీన్ కట్ చేస్తే అధికారంలోకి రాగానే వారికి వెన్నుపోటు తప్పడం లేదు. 2024 మే, 31 నాటికి వైఎస్సార్ జిల్లాలో 647 ఖాళీలున్నట్లు వివరించారు. ఇంతలోనూ సర్‌ప్లస్ పేరుతో మిగులు టీచర్లు 590 మంది ఉన్నారంటూ లెక్కలు కట్టారు. టీచర్ల సర్దుబాటును తెరమీదకు తెచ్చారు.మెగా డీఎస్సీ ప్రకటిస్తామన్న మాటల్లో డొల్లతనం తేటతెల్లమవుతోంది. - సాక్షి ప్రతినిధి, కడప

- నాటి జీఓ 117 ఎత్తేస్తామని ప్రకటించిన నారా లోకేష్
- తాజాగా ప్రత్యేక కేటగిరీ టీచర్లపై అమలు చేసి చూపిస్తున్న వైనం
- జిల్లా వ్యాప్తంగా 590 టీచర్లు మిగులు ఉన్నట్లు ప్రాథమిక అంచనా

సర్ ప్లస్ ఉపాధ్యాయులను గుర్తించిన పాఠశాలలు	413
మొత్తం సర్ ప్లస్ ఉపాధ్యాయులు	590
సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు	365
స్కూల్ అసిస్టెంట్లు	201
లాంగ్వేజ్ పండిట్లు	24

గ్రామీణులకు మెరుగైన విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం శరణ్యమని భావించింది. అప్పట్లో ప్రభుత్వ నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ.. అధికారంలోకి రాగానే తద్భిన్నంగా వ్యవహరిస్తోంది. ఉపాధ్యాయ సంఘాలతో ఎలాంటి చర్చ లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోంది. టీచర్ల సర్దుబాటు ప్రక్రియ తెరపైకి తెచ్చింది. తొలుత పదిమంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇలా చేస్తే ఒక్క వైఎస్సార్ జిల్లాలోనే 305 పాఠశాలలు మూతపడనున్నట్లు సమాచారం. టీచర్లు ఆందోళన చేయడంతో వెంటనే తగ్గి ఆ నిర్ణయాన్ని రద్దు చేసుకున్నారు. తాజాగా డబుల్ టీచర్లు ఉన్న పాఠశాలలను సింగిల్ టీచర్ పాఠశాలగా మార్చి మిగులు టీచర్లను చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 590 మంది సర్‌ప్లస్ టీచర్లు ఉన్నట్లుగా విద్యా శాఖ అంచనాకు వచ్చినట్లు సమాచారం. అయితే మెగా డీఎస్సీ దేవుడెరుగు.. కనీసం ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని.. తర్వాతే సర్దుబాటు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. చిత్తశుద్ధి ఉంటే తెలుగు మీడియం సెక్షన్లు ప్రవేశపెట్టి విద్యార్థులకు విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సర్దుబాటు కాదు.. దిద్దుబాటు ముఖ్యం



ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి లోకేష్ చర్చించి ఎన్నికల హామీని అమలు చేయాలి. 117 ఉత్తర్వులు రద్దు చేయాలి. ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలలో 3, 4, 5వ తరగతుల విలీనాన్ని నిలిపేయాలి. సర్దుబాటు కాదు.. దిద్దుబాటు ముఖ్యం.
– సంగమేశ్వరరెడ్డి, ఎస్టీయూ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి

సర్దుబాట్లు ఆపేయాలి



ఉపాధ్యాయ సర్దుబాట్లకు శాస్త్రీయత లేదు. జీవో 117, దాని అమైన్మెంట్ జీవో 128లను రద్దు చేసి 53 జీవో ప్రకారం సర్దుబాటు చేయాలి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. – జమాల్‌రెడ్డి, అధ్యక్షుడు, ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం

పదోన్నతుల తర్వాతే వర్క్ అడ్జస్ట్‌మెంట్



117 ఉత్తర్వులతో వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను వెంటనే ఆపాలి. విద్యా శాఖ మంత్రి అధికారికంగా ఉపాధ్యాయ సంఘాలన్నింటితో చర్చలు జరపాలి. అక్టోబర్‌లో పదవీ విరమణ పొంది ఖాళీ ఏర్పడబోతున్న పాఠశాలలో వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు అధికారులు శ్రీకారం చుట్టడం అన్యాయం. – సివి ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఏపీటీఎఫ్

ఉల్లాసంగా 'అట్ హోమ్'

కడప సెవెన్‌రోడ్స్: స్వాతంత్య్ర దినోత్సవాలను పురస్కరించుకుని స్థానిక జిల్లా కలెక్టర్ బంగ్లా ప్రాంగణంలో గురువారం సాయంత్రం ఉల్లాస భరిత వాతావరణంలో 'అట్ హోమ్' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి ఏర్పాటు చేసిన.. ఈ తేనీటి విందులో కడప, జమ్మలమడుగు, మైదుకూరు ఎమ్మెల్యేలు మాధవి రెడ్డి, చడిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ వర్మ, డిఎఫ్ఓ సందీప్ రెడ్డి, డిఆర్వో గంగాధర్ గౌడ్, కడప నగర పాలక కమీషనర్ వైఓ నందన్, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

- ఈ సందర్భంగా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ స్వాతంత్య్ర స్ఫూర్తితో దేశ సమైక్యత సమగ్రత కోసం, అన్ని రంగాలలో జిల్లా అభివద్ధికి ఐక్యంగా కషి చేద్దామన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన నృత్య తరంగిణి మాస్టర్ శ్రావణ్ బృందం చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రదర్శించిన నృత్య, గాన కళలు అందరినీ ఆహ్లాదపరిచి ఆకట్టుకున్నాయి.



మహిళా ఉద్యోగినిలను పలకరిస్తున్న కలెక్టర్ దంపతులు

జెండా పండుగ.. హృదయం ఉప్పొంగగ!

కడప పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన శకటాల ప్రదర్శన, పలు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బ్రిటీష్ బానిస సంకెళ్లను తెంచి.. స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న ఈ రోజు అందరికీ పర్వదినం అంటూ ప్రతి ఒక్కరూ చేతిలో జాతీయ పతాకాన్ని చేతబూని ఉత్సవాల్లో పాల్గొన్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, చిత్రంలో కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు


త్రివర్ణ దుస్తుల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో సాహస కృత్యాలు ప్రదర్శిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ


అనంతపురం గ్రామంలో విద్యుత్ మోటార్ల స్టార్టర్ వద్ద వైర్‌ను కత్తిరించిన దృశ్యం

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు, వి.రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె, అనంతపురం గ్రామాల పరిధిలో గత మూడు రోజులుగా వ్యవసాయ విద్యుత్ మోటార్ల విద్యుత్ వైర్లు చోరీకి గురవుతున్నాయి. అనంతపురం పంట పొలాల్లో బుధవారం రాత్రి విద్యుత్ మోటార్ల వైర్లు చోరీకి గురైనట్లు గురువారం ఉదయం రైతులు గుర్తించారు. దీని కంటే ముందు రెండు రోజులు వెదురూరు, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల పరిధిలో 30 మంది రైతులకు చెందిన వ్యవసాయ మోటార్ల వద్ద విద్యుత్ తీగలను గుర్తు తెలియని దుండగలు అపహరించుకుపోయినట్లు రైతులు గుర్తించారు. ఖాజీపేట మండల పరిధిలోని తుడుములదిన్నెలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని కొందరు దొంగలు విద్యుత్ మోటార్ల వద్ద వైర్లు దొంగిలిస్తుండగా స్థానిక ప్రజలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన జరిగిన రెండు రోజుల్లో చాపాడు మండలంలోని వెదురూరు, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె, అనంతపురం గ్రామాల పరిధిలో ఇలాంటి దొంగతనాలే జరగడం గమనార్హం. విద్యుత్ వైర్ల చోరీపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లి గ్రామ సమీపంలోగల స్మశాన వాటికలో బుధవారం అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ సీఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. పశువుల కాపరుల సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించగా మృతుడు పెయింట్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడన్నారు. ఇతనిది కడప నగరంలోని మరియాపురం కాగా, తన తోటి కార్మికులైన శ్యామ్, దినేష్‌లతో బుగ్గలేటిపల్లిలోని ఓ సమాధికి పెయింట్ వేసేందుకు పని ఒప్పించుకున్నాడు. మృతుని శరీరంపై రక్తపు గాయాలు ఉండగా, పక్కనే మద్యం బాటిళ్లు ఉండడంతో అతిగా మద్యం సేవించి మృతి చెంది ఉంటాడా లేదా తోటి కార్మికులతో వాదులాటకు దిగి ఘర్షణలో మృతి చెంది ఉంటాడా అనే విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ, టిప్పర్ ఢీ

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న టిప్పర్

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని వేపమాను సత్రం వద్ద బుధవారం తెల్లవారుజామున టిప్పరు–లారీ ఢీకొన్నాయి. రూరల్ సీఐ శివశంకర్ నాయక్ తెలిపిన సమాచారం మేరకు కోనంపేట గ్రామం నుంచి టిప్పర్ కడపకు కంకర లోడుతో వస్తుండగా, కడప వైపు నుంచి రాయచోటికి వెళుతున్న లారీ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సిద్దవటం మండలం చౌడేశ్వరిపేటకు చెందిన టిప్పర్ డ్రైవర్ పెద్దారెడ్డి చంద్రారెడ్డి (57) తీవ్రంగా గాయపడగా అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్



కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్ : 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గురువారం కలెక్టర్ శివశంకర్ లోతేటి తమ క్యాంపు కార్యాలయం, కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, కలెక్టరేట్ ఏఓ విజయకుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విశేష సేవలకు విశిష్ట పురస్కారం



మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలు, పలు సంస్థల ఆధ్వర్యంలో ఆయా రంగాల్లో విలువైన సేవలు అందించిన వారికి స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అధికారులు ప్రశంసాపత్రాలు అందజేసి గౌరవించారు. గురువారం కడప నగరంలోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 78వ స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తదితరుల చేతుల మీదుగా వీరు ఈ ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వారి వివరాలు ఇలా..


చాముండేశ్వరి, డిస్ట్రిక్ట్ సప్లయ్ ఆఫీసర్


సురేష్‌కుమార్, జిల్లా ఉపాధి కల్పనాధికారి


నాగరాజారావు, జిల్లా చేనేతజౌళిశాఖ అధికారి


బాలాంజనేయులు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్


కె.నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి


జీవీ రమాదేవి, సూపరింటెండెంట్, రిమ్స్, కడప


డాక్టర్ విజయ్‌కుమార్, డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్, ఎన్‌వీఎస్


ఎస్.ఇమ్రాన్, డిస్ట్రిక్ట్ మానిటరింగ్ వెల్ఫేర్ ఆఫీసర్, కడప


రవికుమార్ సబ్ ట్రెజరీ ఆఫీసర్ కడప


వెంకట్రావు, సీపీఓ


ఎల్.సుధాకర్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)


ఎస్ఎస్‌వీ కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ (ఏఆర్)


గంగాధర్‌గౌడ్, డీఆర్‌ఓ


కౌసర్‌బాను, జీఎస్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్


శ్రీనివాస్, ఆర్డీఓ, జమ్మలమడుగు


వెంకటేశులు, ఆర్డీఓ, పులివెందుల


చంద్రమోహన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, టీజీపీ-2, కడప


సరస్వతి, డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమశాఖ, కడప


రమేష్, ఈఈ, విద్యుత్‌శాఖ


పి.శివప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్, వాణిజ్యపన్నులశాఖ


కె.వి. వరప్రసాద రావు ఎంపీడీఓ పోరుమామిళ్ల

దేశభక్తులను హృదయాల్లో నిలుపుకోవాలి


ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నాయకులు

జమ్మలమడుగు: దేశ స్వాతంత్య్రం కోసం పోరాట చేసి ప్రాణాలను అర్పించిన దేశభక్తులను విస్మరించకుండా వారిని గుండెల్లో పెట్టుకుని ఆరాధించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రెడ్డిసేవా సంఘం ఆధ్వర్యంలో ప్రజా కవి వేమన , స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, ఉప్పలపాడు శ్రీనివాసులురెడ్డి, న్యాయవాది మునిసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అంజద్ బాషా మాట్లాడుతూ ఎందరో స్వాతంత్య్ర సమరయోధుల త్యాగ ఫలితంగా స్వాతంత్య్రం సిద్ధించిందన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తితో దేశాన్ని, రాష్ట్రాన్ని ముందుకు నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, పలు కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు కరిముల్లా, పులి సునీల్ , వైఎస్సార్‌సీపీ నాయకులు షఫీ, త్యాగరాజు, సిహెచ్ వినోద్, కె.బాబు, తోట కృష్ణ, పస్తం అంజి, రత్నకుమారి, పత్తి రాజేశ్వరి, ఉమామహేశ్వరి, బాలస్వామిరెడ్డి, సీహెచ్ సునీల్ పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో..

నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు జెండా ఆవిష్కరణ చేసి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో కమిషనర్ వైట నందన్ పాల్గొన్నారు.


పార్టీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, నగర మేయర్

బాకీ డబ్బులు రాలేదని వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : అప్పు తీసుకున్న వారు తిరిగి ఇవ్వని కారణంగా కాసారపు చిన్న వెంకటసుబ్బయ్య (43) అనే వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెన్నానగర్‌కు చెందిన చిన్న వెంకటసుబ్బయ్య కూలి పని చేసుకోవడంతో తన వద్ద ఉన్న డబ్బును వడ్డీలకు ఇచ్చేవాడు. అప్పు తీసుకున్న కొందరు వ్యక్తులు తిరిగి ఇవ్వకుండా అతన్ని ఇబ్బంది పెడుతూ వస్తున్నారు. ఈ బాధతో అతను మద్యానికి బానిసయ్యాడు. డబ్బు విషయమై భార్యాభర్తలు తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో గురువారం చిన్నవెంకటసుబ్బయ్య దూరపు బంధువుల దినఖర్మకు వెళ్లొచ్చాడు. తర్వాత మద్యం తాగి అతను ఇంటికి వెళ్లాడు. రావాల్సిన డబ్బు రాలేదని భార్య శిరీషాకు బాధపడుతూ చెప్పాడు. పిల్లలకు కూడా లేకుండా అందరికీ ఎందుకు అప్పు ఇచ్చావని భార్య భర్తతో చెప్పింది. ఈ క్రమంలో ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత చూసుకోగా ఫ్యాన్‌కు తాడు కట్టుకొని ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చూసుకునేలోగా అతను మృతి చెందాడు. భార్య శిరీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శివశంకర్ తెలిపారు.

కృష్ణా, విశాఖ మ్యాచ్ డ్రా

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన కృష్ణా, విశాఖ మ్యాచ్ డ్రాగా ముగిసింది. 144 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు గురువారం బరిలోకి దిగిన కృష్ణా జట్టు 68.2 ఓవర్లలో 240 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని శ్రీనిశ్చయ్ 92 పరుగులు, ధనుష్ 38 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు యువన్ 4, రోహిత్ 3, రచిత్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 34.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. జట్టులోని హ్రితిక్‌వర్మ 58, పరమ్‌వీర్‌సింగ్ 51 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో విశాఖ జట్టు 480 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్ లభించింది. కాగా కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించాల్సిన చిత్తూరు, కడప మ్యాచ్ శుక్రవారానికి వాయిదా పడింది.


92 పరుగులు చేసిన కృష్ణా బ్యాట్స్‌మన్ శ్రీ నిశ్చయ్


4 వికెట్లు తీసిన విశాఖ బౌలర్ యువన్

ఎమ్మెల్యే పుట్టా సాక్షిగా జాతీయ జెండాకు అవమానం

చాపాడు(మైదుకూరు) : దేశంలో అన్ని వర్గాల ప్రజానీకానికి పెద్ద పండుగ స్వాతంత్య్ర దినోత్సవం. వందేళ్ల పాటు బ్రిటీషు వారి పరిపాలనలో నలిగి మగ్గిపోయిన భారతదేశ ప్రజలకు 1947 ఆగస్టు 15వ స్వాతంత్య్రం వచ్చింది. అప్పటి నుంచి దేశమంతా ఈ రోజు పెద్ద పండుగలా చేసుకుంటారు. అన్ని చోట్ల జాతీయ జెండాను ఎగుర వేసి జాతీయ గీతం ఆలపించి జెండా వందన చేస్తారు. ఇలాంటి మహోన్నతమైన కార్యక్రమంలో గురువారం వైఎస్సార్ జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సాక్షిగా జాతీయ జెండాకు అవమానం జరిగింది. మైదుకూరు పట్టణంలో టీడీపీ కార్యాలయం వద్ద పసుపు రంగులో ఉన్న స్తంభానికి స్వయంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా జాతీయ జెండాను ఎగుర వేసి జాతీయ గీతం ఆలపించారు. జాతీయ జెండా ఎగుర వేసే స్తంభం తెలుపు రంగు లేక జాతీయ జెండా రంగులో మాత్రమే ఉండాలి. కానీ మైదుకూరు టీడీపీ కార్యాలయం వద్ద మాత్రం పసుపు రంగులో ఉండే స్తంభానికి ఎమ్మెల్యే జెండా లాగి ఎగుర వేయటం గమనార్హం. ఇక్కడ ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు, ఆ పార్టీకి చెందిన లాయర్లు, రిటైర్డు ఉద్యోగులు అందరి సమక్షంలో జాతీయ జెండాకు అవమానం జరిగింది.


మైదుకూరు టీడీపీ కార్యాలయం వద్ద పసుపు రంగు స్తంభానికి జెండా ఎగుర వేస్తున్న ఎమ్మెల్యే

వరాల పండుగకు ఘనంగా ఏర్పాట్లు


కడపలో భక్తుల పూల కొనుగోలు


అరటి పిలకలు కొంటున్న భక్తులు

- నేడు వరలక్ష్మీవ్రతం
- ఆలయాలు, ఇళ్లల్లో విశేష పూజలు

కడప కల్చరల్ : వరాల తల్లీ....వరలక్ష్మి....మా పూజలందుకుని వరాలు ప్రసాదించమ్మా...అంటూ మహిళా భక్తులు వరలక్ష్మి మాతను ప్రార్థించేందుకు సిద్ధమయ్యారు. హిందూ మహిళలు సౌభాగ్యం కోసం ప్రార్థించే పండుగల్లో శ్రీ వరలక్ష్మిమాత వ్రతం ముఖ్యమైనది. సంవత్సరం రోజులపాటు ఎంతో ఓపికతో మహిళలు ఈ పండుగ కోసం ఎదురు చూస్తారు. వారం, పది రోజుల ముందునుంచే ఏర్పాట్లు ప్రారంభిస్తారు. అందులో భాగంగా శుక్రవారం పండుగ నిర్వహణ కోసం గురువారం సాయంత్రానికి ఏర్పాట్లు చేసుకున్నారు. పలుచోట్ల బ్రాహ్మణులు, వేద పండితుల ఆధ్వర్యంలో వరలక్ష్మివ్రతం కోసం అమ్మవారి కలశ ప్రతిష్ట చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు. మరికొన్నిచోట్ల సామూహిక వ్రతాల కోసం ఏర్పాట్లు చేసుకున్నారు. శ్రావణమాసంలో వచ్చే ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తే అమ్మవారు కరుణించి కోరిన వరాలిస్తారని, సౌభాగ్యం అందజేస్తారని భక్తుల విశ్వాసం. కోరిన వరాలనిచ్చే వరలక్ష్మిమాతకు పూజలు నిర్వహించడం పలు రకాలుగా శుభదాయకమని భావిస్తున్నారు. ఇందులో భాగంగా కడప నగరంలో శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఉదయం నిర్వాహకులు భక్తులచే సామూహికంగా అమ్మవారి వ్రతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం, సాయంత్రం కూడా పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆలయాలలో పూజల అనంతరం మహిళా భక్తులకు అందజేసేందుకు ప్రసాదంగా పసుపు, కుంకుమలు, గాజులను నిర్వాహకులు సిద్ధం చేసుకున్నారు. మరోవైపు టీటీడీ ఆధ్వర్యంలో జిల్లాలో ఎంపిక చేసిన ఆలయాలలో కూడా వరలక్ష్మి వ్రతాలను నిర్వహించనున్నారు.

మార్కెట్లలో సందడి

వరలక్ష్మివ్రతం నిర్వహణ సందర్భంగా మార్కెట్లు మహిళా భక్తులతో సందడిగా మారాయి. పలు కూడళ్లలో వ్యాపారులు గాజులు, పసుపు కుంకుమలు, వరలక్ష్మిమాత చిన్న పూజా విగ్రహాలు, అరటి పిలకలు, మామిడాకులను విక్రయించారు. వస్త్ర దుకాణాల్లో జాకెట్ పీసులకు మంచి డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా పండ్లు విక్రయించే బండ్లు, పూల దుకాణాల వద్ద విపరీతంగా రద్దీ కనిపించింది. పూలు, పండ్లను రెట్టింపు ధరలకు విక్రయించినా కొనుగోళ్లు జోరుగానే సాగాయి.

పోర్న్ వీడియోలు, డ్రగ్స్‌ను నిషేధించాలి

ప్రొద్దుటూరు క్రైం : మహిళలపై అత్యాచారాలు, హత్యలను ప్రేరేపిస్తున్న పోర్న్ వీడియోలు, మద్యం , డ్రగ్స్‌ను నిషేధించాలని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ తెలిపారు. మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం శివాలయం సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పసి పిల్లలు మొదలుకొని ముసలి వారి వరకు మహిళలకు ఇంటా బయట రక్షణ లేదన్నారు. ఇందుకు నంద్యాల జిల్లాలోని ముచ్చుమర్రిలో కొందరు మైనర్ బాలురు మైనర్ బాలికపై చేసిన అత్యాచార ఘటనే నిదర్శనమన్నారు. అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ అత్యాచారాలు జరగడానికి మొబైల్ ఫోన్లలో లభిస్తున్న అశ్లీల వీడియోల వెబ్‌సైట్‌లే ప్రధాన కారణమని చెప్పారు. ఏరుల్లా పారుతున్న మద్యం, యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్, గంజాయి కారణమని అనేక కేసుల్లో పోలీసులు నిర్ధారించారని తెలిపారు. విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, జామాతే ఇస్లాం మహిళా అధ్యక్షురాలు రెహానా, రాయలసీమ విద్యార్థి శక్తి కన్వీనర్ వడ్ల హరిత, మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ ఎస్పీ మహమూద్, రచయిత జింకా సుబ్రమణ్యం, ఏపీ ఎన్జీఓ సంఘం మహిళా విభాగం చైర్ పర్సన్ జయమ్మ, జనవిజ్ఞాన వేదిక సురేష్, జయచంద్ర, శ్రీనివాసులరెడ్డి, మాలహానాడు నేత మురళీప్రసాద్, దళిత సమాఖ్య నేత ఎల్లయ్య, మున్సిపల్ యూనియన్ నాయకుడు చిన్న, టీడీపీ యూత్ కన్వీనర్ ప్రతాప్ పాల్గొన్నారు.


శివాలయం సెంటర్‌లో ర్యాలీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు